
www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 6 ఆగస్టు 2024

5

తిరుపతి



వాయనాడ్ బాధితులను ఆదుకోండి : సిపిఎం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ, ఏర్పేడు



కేరళ వాయనాడు వరద బీభత్సానికి గురైన ఎన్నో కుటుంబాలు చెల్లా చెదురై శవాల గుట్టలను తలపించేలా హృదయవిదారక ఘటనలు ఉన్నాయని సిపిఎం మండల కార్యదర్శి నలుగురు రమణయ్య ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, దుకాణాల్లోనూ విరాళాలను సేకరించారు. సిపిఎం నాయకులు తిరుపాలయ్య, జికె రమణయ్య, సుబ్బయ్య, గురవయ్య పాల్గొన్నారు. ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో సిపిఎం ఆధ్వర్యంలో నిధి వసూలు చేశారు. కొల్లం రంగయ్య, రాంబాబు, ధర్మారెడ్డి,కరీముల్లా పాల్గొన్నారు. 3,345 రూపాయల విరాళం వసూలయ్యింది.

చిత్తూరులో...



తిరుపతిలో...



కదం తొక్కిన స్కీం వర్కర్లు

- కలెక్టరేట్ల ఎదుట భారీ ధర్నా
- సిఐటియు ఆధ్వర్యంలో డిఆర్ఒకు వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, చిత్తూరు అర్బన్

చిరుద్యోగులను రాజకీయ కక్షతో అక్రమంగా తొలగించడాన్ని, వేధింపులకు గురిచేయడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో తిరుపతి, చిత్తూరు కలెక్టరేట్ల వద్ద సోమవారం స్కీం వర్కర్లు భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్ఒకు వినతిపత్రం సమర్పించారు. తిరుపతిలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు విపరీతంగా పెరిగాయన్నారు. అనంతపురం జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులను 670 మందిని తొలగించారని, ప్రకాశం జిల్లా ఎర్రగుండపాలెంలో 300 మందికి పైగావిఒఎలను తొలగించారని, రాష్ట్రవ్యాప్తంగా 2360 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నలుగురు చిరుద్యోగులు ఆత్మహత్య చేసుకుని చనిపోయారన్నారు. ఆశా, అంగన్వాడీ, ఇతర రంగాల్లోని కార్మికులను తీవ్రంగా వేధిస్తున్నారన్నారు. అధికార పార్టీ నాయకులు ఒత్తిడిలకు లొంగిపోతే అధికారులు న్యాయపరమైన చిక్కుల్లో పడతారని హెచ్చరించారు. తిరుపతి జిల్లాలోనూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. హైకోర్టులో న్యాయ పోరాటం చేస్తామన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, వేధింపులకు పాల్పడుతున్న అధికార పార్టీ నాయకులపై కేసులు పెడతామని చెప్పారని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు, పవన్కళ్యాణ్, లోకేష్లు పదేపదే రాజకీయ వేధింపులకు తాము వ్యతిరేకమని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అధికార పార్టీ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ప్రసాదరావు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు , పుల్లయ్య, జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, వెంకటేష్, గురవయ్య, హరినాథ్, ముకుంద, చెంగయ్య, వేణుగోపాల్, మాధవ కృష్ణ, బుజ్జి, అంగన్వాడి యూనియన్ అధ్యక్షురాలు పద్మ లీల, ధనమ్మ, శ్యామల, ముని కుమారి, సౌజన్య, సంఘమిత్రల అధ్యక్షురాలు లక్ష్మీ, స్కీం వర్కర్లు కవిత, ఉష, సుజాతమ్మ, మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు విజయమ్మ, వాణి, మీనా, భారతమ్మ పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నేటివరకు జిల్లాల్లో వివిధ రంగాల కార్మికులను అక్రమంగా తొలగించడానికి నిరసిస్తూ సోమవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో భారీ ధర్నా జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి స్కీంవర్కర్ల సంఘం గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేంద్రన్ మాట్లాడుతూ ఈ తెలుగుదేశం ప్రభుత్వంలో రాజకీయ అక్రమ తొలగింపులే అని, దీనికి చట్టబద్ధత లేదని అన్నారు. స్థానిక గ్రామపెద్దలు కక్షలతో తొలగించడం సిగ్గుచేటన్నారు. కొత్తవారిని ఈ ఖాళీలలో ఉద్యోగాల్లో నియమించి లక్షల్లో డబ్బులు దండుకోవాలన్నదే కొందరు నాయకుల ప్రయత్నమని, జిల్లాల్లో కార్మికులను బలవంతంగా ఉద్యోగాల నుండి బయటకు గెంటివేస్తున్నారని ఆరోపించారు.

అభివృద్ధి చేసే వారికే పట్టం : టిటిడి ఎస్డబ్ల్యుయుఎఫ్

ప్రజాశక్తి - తిరుపతి సిటి



సెప్టెంబర్ 19న జరగబోయే టిటిడి ఎంప్లాయిస్ బ్యాంక్ ఎన్నికల్లో తమ అభ్యర్థులు పూజారి రత్న ప్రభాకర్ , నైనార్ పద్మాకర్ , పట్నం దయాకర్ లను అఖండమెజారిటీ తో గెలిపించాలని.. టిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ నేతలు గోల్కొండ వెంకటేష్ , కొట్టె గుణశేఖర్ పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్లో సోమవారం మీడియా ముందు వీరు మాట్లాడుతూ... గతంలో తాము బ్యాంక్ అభివృద్ధికి కృషి చేశామని, ఈనెల 19 తో తమ కాల పరిమితి ముగుస్తుందన్నారు. తాము బ్యాంక్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశామన్నారు. చైర్మన్ హేమలత బ్యాంకును ఇష్టారాజ్యంగా ఆమె సొంతానికి వాడుకున్నారని ఆరోపించారు. ఇలాంటి ఆగడాలకు అడ్డుకట్టు వేయాలంటే .. తమ యునైటెడ్ ఫ్రంట్ నాయకుల ప్యానల్ను గెలిపించాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నాయుడుపేట



తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని వి. సుందర రామి రెడ్డి భవన్ సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఎస్ఎఫ్ఐ జనరల్ బాడీ సమావేశం జరిగింది. నాయుడుపేట ఎస్ఎఫ్ఐ నూతన అధ్యక్ష, కార్యదర్శు లుగా నందకిరణ్, మనోజ్ లను తిరుపతి జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి భగత్ రవి ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా వరప్రసాద్, సుకుమార్, సహాయ కార్యదర్శులుగా ఉదయ్ కుమార్, పెంచలయ్య, హరీష్, అజయ్ లను ఎంపిక చేశారు. మరో 20 మందితో నూతన కమిటీ ఏర్పాటయ్యింది. విద్యారంగ సమస్యలపై, హాస్టల్లో సౌకర్యాలపై పోరాటాలకు సిద్ధం అవుతున్నట్లు తెలిపారు.



'మ్యూజిక్ ఆఫ్ హోం' ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

గర్భవతులను దృష్టిలో ఉంచుకుని ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలకు మ్యూజిక్ ఆఫ్ హోం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిఇఒ వినేష్ గాదియా అన్నారు. ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవంలో భాగంగా ఆంధ్ర, తెలంగాణా అంతటా 15వేర్వేరు ప్రదేశాల్లో వీధినాటకాలు, నాటకాలను ప్రదర్శించినట్లు చెప్పారు. తద్వారా వంధ్యత్వం, ఐవిఎఫ్ పట్ల అపోహలను నివృత్తి చేశామన్నారు. సంగీతం మానసిక ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుందన్నారు. ప్రేక్షకులు శాంతియుత వాతావరణంలో ట్యూన్ను వినాలన్నారు.

కాల్వల్లో చెత్త కనిపిస్తే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



మురుగు కాలువల్లో ఎక్కడా చెత్త ఉండకూడదని, అలాగే మురుగునీరు నిలవకుండా తగు చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. సోమవారం తెల్లవారుజాము నుండి నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీ కాలువలను ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. నగరంలోని న్యూ మారుతీ నగర్, మూత్యాలరెడ్డి పల్లి పంచాయతీ కార్యాలయం, ఈ ఎస్ ఐ ఆసుపత్రి, స్విమ్స్ కూడలి వద్ద పున్న ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్న అన్నా క్యాంటీన్లను పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న చిన్నచిన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే నగరంలో మరమ్మత్తులు పూర్తి చేసిన బోర్లను పరిశీలించి, ప్రజలకు నీటి కొరత రాకుండా నీరు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పలు చోట్ల ఉన్న పెద్ద, చిన్న డ్రెయినేజీ కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని చిన్న, పెద్ద మురుగు కాలువల్లో నిరంతరం చెత్త లేకుండా తొలగించాలని, మురుగునీరు నిలవకుండా సిల్ట్ తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డి.ఈ.లు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, నరేంద్ర, మహేష్, శ్రావణి, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, మేస్త్రిలు, సెక్రటరీ లు తదితరులు అన్నారు.

ఉచితంగా ఇసుక ఇవ్వాలి

భవన నిర్మాణ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - గూడూరు టౌన్

వినియోగదారులందరికీ ఇసుకను ఉచితంగా ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వివేకానందరోడ్డు, ముత్యాలపేట, రైతుబజారు మీదుగా రాజావీధి, గాంధీబొమ్మ, సంఘం థియేటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఉచిత ఇసుక ఇవ్వాలని, భవన నిర్మాణ పనులకు ఇబ్బంది లేకుండా చూడాలని నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా నాయకులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్ఆర్ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికుల కడుపు కొట్టిందన్నారు. సంక్షేమ బోర్డును రద్దు చేసిందన్నారు. జీవో 12, 14 తీసుకొచ్చి కార్మికుల కడుపు కొట్టిందన్నారు. గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్ మాట్లాడుతూ గూడూరు పరిసర ప్రాంతాల్లో ఇసుక లేక రోజువారీ పని చేసుకునే కూలీలు ఇంటికే పరిమితమయ్యారన్నారు. ఈ మేరకు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీవో స్పందిస్తూ బాలిరెడ్డిపాలెం సర్కిల్లో ఇసుక క్వారీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపకులు పుట్టా శంకరయ్య, నాయకులు సేలం సేకరాచారి, గండికోట మధు, ఎస్.డి. రఫి, సిఐటియు నాయకులు బి.వి. రమణ య్య, పట్టణ కార్యదర్శి ఎస్. సురేష్, అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య , సామంజి మని పాల్గొన్నారు.





శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో తనిఖీ చేస్తున్న ఈవో ఎన్విఎస్ఎన్ శర్మ

అక్రమ వసూళ్లకు పాల్పడొద్దు..

శ్రీకాళహస్తీశ్వర ఆలయ ఈవో శర్మ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆలయంలో భక్తుల నుంచి ఎలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడవద్దని శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వాహణాధికారి ఎన్విఎస్ఎన్ శర్మ ఆలయ అర్చకులు, వేద పండితు లు, సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన శ్రీకాళహస్తీశ్వ రాలయంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రాహు-కేతు పూజా మండపాలు, స్వామి అమ్మవారి సన్నిధి ప్రాంతాలను పరిశీలించారు. ఎవరూ భక్తుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడ కూడదని ఆదేశించారు. ఆలయంలో దళారీ వ్యవస్థను సమూలంగా రూపుమాపేందుకు కృషి చేస్తున్నామని, ఆలయంలో దళారీలు కనిపిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు.



పోలీసుల అదుపులో వున్న ఎర్ర చందనం స్మగ్లర్లు

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

నలుగురు స్మగ్లర్ల అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధిలోని వెంకటగిరి సమీపంలో 12 ఎర్రచందనం దుంగల సహా నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుండి రెండు మోటారు సైకిళ్లను టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఇన్ఛార్జి తిరుపతి ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాలతో టాస్క్ ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీ చెంచుబాబు సూచనలతో ఆర్ఐ చిరంజీవులు కు చెందిన ఆర్ఎస్ఐ నరేష్ బృందం స్థానిక అటవీ అధికారుల సాయంతో సోమవారం వెంకటగిరి ఫారెస్ట్ రేంజి, డక్కిలి అటవీ ప్రాంతం వైపు, సీసీ కండ్రిగ వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల తనిఖీ నిర్వహించామన్నారు. తెల్లవారు జామున వెంకటగిరి హిల్స్ చేరుకోగా, అక్కడ రెండు మోటారు సైకిళ్లతో కొంత మంది వ్యక్తులు కనిపించారని వారికి సమీపిస్తుండగా వారు పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని వెంబడించి నలుగురిని పట్టుకున్నామన్నారు. పట్టుబడ్డ వారు వెంకటగిరి మండలానికి చెందిన దండు సురేంద్ర , పారవోలు పెంచలయ్య , త్రిపురాంతపల్లి వెంకటేష్ , రేణిగుంట మండలానికి చెందిన కొల్లంగుంట సురేష్ బాబు లుగా గుర్తించామన్నారు. వారు దాచి ఉంచిన 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనపై తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ లో సీఐ సురేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంద్రాగస్టుకు అన్న క్యాంటీన్లు రెడీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆగస్టు 15వ తేదీ నాటికి శ్రీకాళహస్తి పట్టణంలో అన్నా క్యాంటీన్లను ప్రజలకు అందుబాటులోకి తేనున్నామని మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. సోమవారం ఆయన మరమ్మతుల్లో ఉన్న అన్న క్యాంటీన్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల్లో మరింత వేగం పెంచాలని కాంట్రాక్టర్ను ఆదేశించారు. రామసేతు వంతెన వద్ద రూ.13 లక్షల వ్యయంతో, ఎన్టీఆర్ భవన్ సమీపంలో రూ. 10 లక్షల వ్యయంతో అన్నా క్యాంటీన్లకు మరమ్మతు పనులు చేస్తున్నామని చెప్పారు. పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్లను అనుకున్న గడువులోపే అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

భూస్వాముల ఆగడాలు అరికట్టాలి

- ఎస్సి, ఎస్టి, బిసిలకు పట్టాలివ్వాలి
- కలెక్టర్కు సిపిఎం వినతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గూడూరు మండలం, కాండ్ర గ్రామంలో భూస్వాముల ఆగడాలను అరికట్టి, వారి స్వాధీన అనుభవంలో ఉన్న భూమిని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పట్టాలిచ్చి అప్పగిం చాలని తిరుపతి జిల్లా సిపిఎం కార్యదర్శి వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో ఆ గ్రామస్తులతో కలిసి తిరుపతి కలెక్టర్ కార్యా లయంలో వెంకటేశ్వర్కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు మండలం కాండ్ర గ్రామానికి చెందిన హరిజన, గిరిజన, అరుంధతీ సామాజిక వర్గానికి చెందిన నిరుపేదలు వున్నారని ఆ గ్రామానికి సరిహద్దులో వున్న ఓజిలి మండలం, వేర్లగునపాడు రెవెన్యూలోని ప్రభుత్వ భూమిలో 2000 వ సంవత్సరంలో అప్పటి నెల్లూరు కలెక్టర్ ఉత్తర్వుల మేరకు 20.8,10,19,20,21,22, 23,25,26, 27,28, 29,30 సర్వే నెంబర్లలోఉన్న 60 ఎకరాల భూమిని 45 మంది ఆ భూమిలో చెట్టు, పుట్ట కొట్టి చదును చేసుకొని వర్షాధార వంటలైన మినుము, పెసర, నువ్వులు తదితర పంటను సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి ఇచ్చిన సిజెఎఫ్ఎస్ ల్యాండ్ తెలుగుగంగ కాలువకు ఏర్పాటులో పోయిందని, అయితే తమకు ఎలాంటి ఆర్థిక పరిహారం అందివ్వలేదన్నారు. అప్పటి కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా ఎక్కడైనా ప్రభుత్వ భూమి ఉంటే అందులో పట్టాలు ఇస్తామని చెప్పారన్నారు. ఓజిలి మండలం, వీర్లగునపాడు రెవెన్యూలో ప్రభుత్వ భూమి వుందని తెలిపామని కలెక్టర్ వెంటనే ఓజిలి తహశీల్దారు కాండ్ర గ్రామంలో ఎస్సీ, ఎస్టీలకు భూపట్టాలు ఇవ్వాలని ఆదేశించారన్నారు. అప్పటి నుండి తాము ఆ పొలంలో సాగు చేశామని తెలిపారు. గ్రామంలోని రాజులు తమ పేర్లను సాగు రానివ్వకుండా విఆర్ఏ, ఎంఆర్ఓలకు డబ్బులు ఇచ్చి రికార్డులో రాజుల పేర్లను అడంగల్ రికార్డుల్లో పొందుపరచి నకిలీ పాస్ పుస్తకాలు పొందారని అప్పటి ఓజిలి ఎంఆర్ఓ భూపట్టాల నిమిత్తం అర్జీ ఇవ్వగా గూడూరు ఎంఆర్ఓ నుండి అర్హుల జాబితాను కోరగా కాండ్ర గ్రామ విఆర్ఓ మార్చి 6, 2010న ఓజిలి ఎమ్మార్వో కి పంపారన్నా రు. అప్పటి నుండి ఎన్నో పర్యాయాలు ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్లకు పట్టాలు ఇవ్వాలని కోరుతున్నా మన్నారు. 20 సంవత్సరాలు సాగులో ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీలకు భూపట్టాలను ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం 2020 మేలో ఆదేశాలు జారీ చేయడంతో 2020 జులై 2న కొంత మందికి పట్టాలు ఇచ్చారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మిగిలిన వారికి సర్వే చేసి తరువాత ఇస్తామని చెప్పారన్నారు. తాము సాగు చేసుకుంటున్న పొలానికి పట్టాలు ఇవ్వకపోగా ఎస్ఐ ఆదిలక్ష్మి తమపై క్రిమినల్, సివిల్ కేసులు పెట్టారని వాపోయారు. పేదలుగా తాము వేసుకున్న నిమ్మ చెట్లకు రక్షణగా ఉన్న ఫెన్సింగ్ ను తొలగించి ముప్పాల పెంచల రాజుకి 30 ఎకరాల ప్రభుత్వ భూమిని ధారాదత్తం చేశారన్నారు. తమ స్వాధీన అనుభవంలో ఉన్న పొలాలకు కలెక్టర్ పట్టాలు ఇప్పించాలని భూ బాధితులు కోరారు.

స్పెషల్ చిల్డ్రన్కు శ్రీవారి ఆశీస్సులు : ఎంఎల్ఎ




ప్రజాశక్తి - రేణిగుంట

రోటరీ క్లబ్, టిటిడి చెన్నై స్థానిక సలహా కమిటీ సంయుక్తంగా స్పెషల్ చిల్డ్రన్ లకు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం కల్పించాయి. చెన్నై నుంచి శ్రీవారి దర్శనార్థం 1008 మంది స్పెషల్ చిల్డ్రన్ సోమవారం ఉదయం రేణిగుంట రైల్వేస్టేషన్ కు చేరుకోగా వీరికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్ నుంచి తిరుమలకు స్పెషల్ చిల్డ్రన్ ను తీసుకువెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. ఈ బస్సు లను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. స్పెషల్ చిల్డ్రన్ లతో ఎమ్మెల్యే ముచ్చటించారు. కళ్ళు కనపడని బాలుడుతో శ్రీ వెంకటేశ్వర స్వామిని ఎలా చూస్తావు అని ఎమ్మెల్యే అడగగా తాను చూడకపోయినా స్వామి తనను చూస్తాడని బదులిచ్చారు. స్పెషల్ చిల్డ్రన్స్ కోసం టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రత్యేకంగా దర్శన ఏర్పాటు చేయడాన్ని అభినందిస్తునట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహావీర్ బోత్రా, ఈవెంట్ చైర్మన్ పంకజ్ కంకరియా, జనసేన శ్రీకాళహస్తి ఇంచార్జీ వినూత, టిడిపి కార్పొరేటర్ ఆర్సీ మునికష్ణ, జనసేన తిరుపతి నగర అధ్యక్షులు రాజారెడ్డి, సుధాకర్, బాబ్జీ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

యాదవ యువజన రాష్ట్ర అధ్యక్షులుగా శంకర్ యాదవ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఏపీ అఖిలభారత యాదవ యువజన మహాసభ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా తిరుపతికి చెందిన టిడిపి యువ నేత శంకర యాదవ్ ఎంపికయ్యారు. ఢిల్లీలో నేషనల్ అఖిలభారత యాదవ మహాసభ సంఘం అత్యవసర సమావేశం ఇటీవల నిర్వహించారు. ఈ సమావేశంలో శంకర్ యాదవ్ నియామక పత్రాన్ని ఆ సంఘం జాతీయ అధ్యక్షులు మహేష్ యాదవ్, నేషనల్ సీనియర్ ఉపాధ్యక్షులు అన్న రామచంద్ర యాదవ్, నేషనల్ జనరల్ సెక్రెటరీ నత్తు నరేంద్ర యాదవ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు లాక వెంగళరావు చేతుల మీదుగా శంకర్ యాదవ్కు నియామక పత్రాన్ని అందుకున్నారు. ఏపీ అఖిలభారత యాదవ యువజన మహాసభ సంఘంలో చురుగ్గా పనిచేస్తున్న శంకర్ యాదవ్ కు ఏపీ అఖిలభారత యాదవ యువజన రాష్ట్ర మహాసభ సంఘం అధ్యక్షులుగా నియమించడం జరిగిందని, నేటి నుండి శంకర్ యాదవ్ సంఘం బలోపేతానికి అలాగే యాదవ జాతి ని సామాజిక, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు కషి చేయాలని వారు పిలుపునిచ్చారు.



విద్యావసరాలు తీర్చేందుకు 'ఆషా' సిద్ధం

ప్రజాశక్తి - రేణిగుంట

గిరిజన కాలనీ లోని పిల్లలు చదువుకునేందుకు అవసరమైన ఎటువంటి సహాయం చేయడానికైనా ఆషా స్వచ్ఛంద సంస్థ సిద్ధంగా ఉంటుందని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు అన్నారు.రేణిగుంట మండలం గురవరాజు పల్లి పంచాయతీ లోని యానాది కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన రెండు బోర్డ్ లను ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు సోమవారం ఉపాధ్యాయులకు అందించారు.ఈ సందర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ చిన్న కాలనీలో 25 మంది విద్యార్థులు వచ్చి చదువుకోవడం హర్షించదగ్గ విషయమని అన్నారు.ఇందుకు కషిచేసిన ఉపాధ్యాయులకు పిల్లల్ని క్రమం తప్పకుండా పంపుతున్న తల్లిదండ్రులకు కతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల అభ్యున్నతి కోసమే ఆషా స్వచ్ఛంద సంస్థను స్థాపించామన్నారు.ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థ లు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరి, సురేష్,వార్డు మెంబర్ సుబ్బమ్మ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ

ప్రజాశక్తి - రేణిగుంట

కరకంబాడి అమరరాజా విద్యాలయంలో వాతావరణంలో జరిగే మార్పులపై భూగ్రహంపై కలిగే దుష్ప్రభావాలను 'పరివర్తన్ ప్రభావ్' పేరుతో సోమవారం అమరరాజా ఆడిటోరియంలో ఇంటర్ స్కూల్ కాంపిటీషన్ నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా విచ్చేసిన నారాయణ కాలేజీ కెమిస్ట్రీ లెక్చరర్ చిట్టిబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే ప్రజల మనుగడ సాధ్యమన్నారు. అమరరాజా సంస్థల ఐటి హెడ్ కె.కృష్ణ సుబ్రమణ్యం మాట్లాడుతూ రానున్న తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలన్నారు. భారతీయ విద్యా భవన్, లిటిల్ఏంజెల్స్, బిజిఎస్ విజ్ఞతం, మంగళ్ విద్యాలయం, అమర రాజా విద్యాలయం దిగువమాఘం, వెరిటాస్ సైనిక్ స్కూల్ మొత్తం 11 పాఠశాలలకు చెందిన విద్యార్థులు .. మనం నివసించే భూమిని మనం ఎలా కాపాడుకోవాలి.. వాతావరణంలో ఎలాంటి మార్పులు జరుగుతున్నాయి అనే విషయాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పోటీలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు న్యాయ నిర్ణేతలు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమర రాజా మొబిలిటీ సీనియర్ మేనేజర్ బాలసుబ్రమణ్యం , ప్రధానోపాధ్యాయురాలు గ్లోరీ దేవప్రియ పాల్గొన్నారు.

భూస్వామి చెరనుంచి కాపాడండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ గూడూరు మండల పరిధిలోని విందూరు గ్రామంలో భూస్వామి చెర నుంచి పేదల భూమిని కాపాడాలని నియోజకవర్గ కన్వీనర్ సివిఆర్ కుమార్ అన్నారు. సబ్కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో కిరణ్కుమార్కు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. విందూరు గ్రామానికి చెందిన రాగమ్మకు చెందిన 3.71 సెంట్ల భూమిని అదే గ్రామానికి చెందిన ఓ భూస్వామి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భూమిని స్వాధీనం చేసుకున్నారన్నారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన అధికారులపై చర్యలు చేపట్టాలన్నారు. ప్రభాకర్, శశి, కాలేషా, ఎంబేటి చంద్రయ్య పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్ వాడకంపై విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

గుడిపాల మండలం, కొత్తపల్లి సెక్షన్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పాలసముద్రం, చెత్త పారా, దిగువ పిల్లారి కుప్పం, అమ్మవారిపల్లి, చింతగుంట, రామభద్రపురం, చలిచిములపల్లి, బొమ్మసముద్రం, కోటూరు మొదలైన గ్రామాలలో ఎస్పీడీసీఎల్ విజిలెన్స్ సిబ్బంది సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న పలు ఇల్లులు, షాపులపై 75 కేసులు నమోదు చేసి, 3 లక్షల 32 వేల రూపాయలు పైగా జరిమానా విధించారు. విద్యుత్ అక్రమ చౌర్యం చట్టరీత్యా నేరమని, కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి విజిలెన్స్ విభాగం ఈఈ పుల్లా బాలాజీ, పూర్ణచంద్ర కుమార్, నరసింహమూర్తి, హరినాథ రాజా, చలపతి, కష్ణయ్య, శ్రీనివాస రావు పాల్గొన్నారు.

ఉద్యాన పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఉద్యాన శాఖ అధికారిణి యామిని



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ఉద్యాన పంట శాఖ అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారిణి యామిని పేర్కొన్నారు. సోమవారంతమె తమ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యాన శాఖ ద్వారా పండ్ల తోటలు వేసే రైతులకి మామిడికి రూ.7,950, జామకు రూ.17,599, డ్రాగన్‌ఫ్రూట్‌కి, అంజీర్‌కి 30 వేల రూపాయలు సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. పండ్ల తోటలకి మూడేళ్ల సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. కూరగాయల పంటలకు హైబ్రిడ్ కూరగాయల పథకం కింద ఒక హెక్టారుకి రూ.20వేలు, పూల తోటలకు రూ.16 వేలు, మల్చింగ్ షీట్‌కి రూ.16 వేలు చెల్లిస్తుందన్నారు. ఆయిల్ పామ్ మొక్కలను ప్రభుత్వ కంపెనీల ద్వారా మనకి ఉచితంగా ఇస్తుందని, దేశీ మొక్కలకు రూ. 20 వేలు, విదేశీ మొక్కలకు రూ. 29వేలు సబ్సిడీ ఇస్తున్నారు. ఆయిల్‌పామ్ వేసిన నాలుగు ఏళ్ల పాటు పంటకు, ఎరువులకు కలిపి 42 వేల రూపాయలు సబ్సిడీ రూపంలో వస్తుందని తెలిపారు. పంట దిగుబడి వచ్చాక దాని కొనుగోలు సైతం కంపెనీ నిర్వహిస్తుందన్నారు. రైతులు ఈ సబ్సిడీలను వినియోగించుకోవాలని, అవసరం ఉన్న రైతులు తమ ఫోను నెంబరు 7995086941ను సంప్రదించాలని ఉద్యాన అధికారిణి యామిని పేర్కొన్నారు.

10న ఆదిశంకరలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈ నెల 10వ తేదీ గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ మురగదాస్ పేర్కొన్నారు. గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మురగదాస్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని అనేక బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ప్రత్యేక ప్రతిభావంతులు కూడా జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఇమ్మాయేల్ , విజయనిర్మల పాల్గొన్నారు.

రెడ్ సంస్థ సేవలు అభినందనీయం: డాక్టర్ రోహిణి



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: స్థానిక త్యాగరాజ వీధిలోని కళ్యాణ వీరభద్ర స్వామి ఆలయంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో37 మంది ప్రత్యేక ప్రతిభా వంతులకు సోమవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాత పొత్తూరి విజయకుమారి ఐదు వేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రతీ నెల క్రమం తప్పకుండా రెడ్ సంస్థ సరుకులు పంపిణీ చేయడం అభినంద నీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావం పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ మండలి కార్యదర్శి విష్ణు వందన, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు తనూజ రెడ్డి, సభ్యులు స్నేహలత రెడ్డి, శశికళ, లక్ష్మి, రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, కోదిరెడ్డి శ్రీధర్, పల్లం వెంకటేశ్వర్లు, శ్రీనివాసులచారి పాల్గొన్నారు.

తహశీల్దారుకు సన్మానం

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మండల నూతన తహశీల్దార్ శివరామ సుబ్బయ్యను దళిత సంఘాల నాయకులు సోమవారం దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ పోరాట సమితి అధ్యక్షులు బాదురు ఎల్లయ్య మాట్లాడుతూ చంద్రగిరి మండలంలో దళిత సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటిని తెలపడానికి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి మీ దృష్టికి తీసుకొస్తామని వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలోని అనేక మంది సమస్యలు తెలుపుకునేందుకు ఇరిగేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వస్తుంటారని సరైన మరుగుదొడ్లు లేక వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. మరుగుదొడ్లను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ పోరాట సమితి ప్రధాన కార్యదర్శి శ్రీపతి, బాలసుబ్రహ్మణ్యం, టిడిపి సీనియర్ నాయకులు పట్టిపాటి, పరమాలు గోపీ, పరమేశం, మనోహర్, త్యాగరాజు, సుబ్రహ్మణ్యం, బాలాజీ, మణి, భాస్కర్ పాల్గొన్నారు.

'స్టూడెంట్ నేషన్ వాలంటీర్స్ సేవలు అభినందనీయం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో స్టూడెంట్ నేషన్ వాలంటీర్స్ సేవలు అభినందనీయమని తిరుపతి-కరకంబాడి మార్గంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాథముని రెడ్డి అన్నారు. అన్నమాచార్య కళాశాలలో సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, బ్లడ్ బ్యాంక్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సాంకేతిక సహకారంతో కళాశాలకు చెందిన స్టూడెంట్ నేషన్ వాలంటీర్స్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాథముని రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు 300 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ నేషన్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఏపీ చౌదరి, డి త్రివిక్రమ్ రెడ్డి, అన్నమాచార్య కళాశాల చైర్మన్ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి నాదమునిరెడ్డి ప్రోత్సాహంతోనే ఇంతటి మెగా క్యాంప్ ని విజయవంతంగా నిర్వహించామన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్యాంపులో రెడ్ క్రాస్ సొసైటీ తరఫున ప్రిన్సిపాల్ కు, స్టూడెంట్ నేషన్ కు షీల్డ్, అవార్డులు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు.

'తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా'

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా అని ఆరోగ్య అధికారిణి డాక్టర్ పి శశికళ తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్రం (ఆర్ హెచ్ టి సి) హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.శశికళ ఆధ్వర్యంలో సోమవారం నూకలగుంట గ్రామంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ పి.శశికళ తల్లిపాలపై గర్భవతులకు, బాలింతలకు, తల్లులకు,అవగాహన కల్పించారు. ప్రతి బిడ్డ ప్రసవమైన ఒక గంటలోపు ముర్రుపాలు పట్టించాలని, తల్లిపాలే బిడ్డకి మొదటి టీకా అని, ముర్రుపాలలో ఉండే కొలొస్ట్రం వ్యాధి నిరోధకతను కలిగి ఉండి వ్యాధులను అరికడుతుందని తెలిపారు. తల్లులకు కూడా రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉపయోగపడుతుందని తెలిపారు. ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే తాగించాలని ఇది కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతిగా కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. డబ్బా పాలు వలన కలిగే అనర్ధాలు పిల్లల్లో నిమోనియా, డయేరియా, పేగుల ఇన్ఫెక్షన్ లాంటివి రాకుండా అరికట్టవచ్చని తెలిపారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎమ్. టాటా బాబు, సూపర్వైజర్ నారాయణ రాజు, ఏఎన్ఎంలు గిరిజ, శశికళ మరియు వెలుగు సిసి సుధాకర్ నూకలగుంట గ్రామంలోని తల్లులు పాల్గొన్నారు.


సమర్థవంతంగా ప్రజలకు సేవ చెయ్యాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు అధికారులతో కలసి సమిష్ఠిగా పనిచేసి ప్రభుత్వ పథకాలు అమలు చేసి, ప్రజలకు సేవచేయడంలో ముందంజలో వుండాలని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సచివాలయానికి వచ్చే ప్రతి బాధ్యతగా వ్యవహరించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పింఛన్ ల పంపిణీ విజయవంతం చేస్తున్న సచివాలయ ఉద్యోగుల శ్రమను గుర్తించి అభినందించారు. ప్రభుత్వ ప్రాధాన్యత లను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో సమర్థవంతంగా పని చేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గాలి జీవరత్నం నాయుడు, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, రాష్ట్ర యువత కోఆర్డినేటర్ డిజి ధనపాల్, జనసేన నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మెరుపుల మహేష్, మాజీ మున్సిపల్ డిప్యూటి చైర్మన్ యుగంధర్, అంకయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి మహేష్, మాజీ వైస్ చైర్మన్ ఎ ఆనంద్, కుప్పయ్య, ఎస్ మోహన్ రాజు, ప్రసాద్ నాయుడు, కౌన్సిలర్ భువనేశ్వరి, మహిళా నాయకురాలు నాగరత్నం,మోహన, బాబు నాయుడు, టిడిపి నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులు విలువిద్యలో రాణించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు విలువిద్యలో రాణించాలని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ విసి జిఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో ఆర్చరీ కోచింగ్ క్యాంపును సోమవారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఆర్చరీ ప్రదర్శన నిర్వహించారు. ప్రొఫెసర్ కృష్ణమూర్తి విలువిద్య విశిష్టతను వివరించారు. విశ్వవిద్యాలయంలోని విద్యార్థులందరూ ఈ శిక్షణలో పాల్గొని, విలువైన మన భారతీయ విలువిద్యను నేర్చుకోవాలని వివరించారు.

తహశీల్దారుల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన తహశీల్దారు రాజశేఖర్

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహశీల్దారు రాజశేఖర్ పేర్కొన్నారు. మండల నూతన తహశీల్దారు రాజశేఖర్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరిం చారు. గతంలో వరదయ్యపాలెం రీసర్వే, డిప్యూటీ తహశీల్దారుగా విధులు నిర్వహించి ఎన్నికల సమయంలో తహశీల్దారుగా ఉద్యోగోన్నతి పొంది అనంతపురానికి వెళ్లారు. ఎన్నికలు అనంతరం వరదయ్యపాలెం తహశీల్దారుగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దారు రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కులం, ఆదాయం ధ్రువపత్రాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరువ చేసి మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపి స్తామన్నారు. అనంతరం వీఆర్వోలు, వీఆర్ఏ, రెవెన్యూ సిబ్బందితో సమావేశమ య్యారు. సిబ్బంది బాధ్యతగా వ్యవహరిస్తూ అందు బాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్క రిం చాలన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది తహశీల్దారుకు శుభాకాంక్షలు తెలిపారు.

బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండల తహశీల్దారు ఐ సుబ్రహ్మణ్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో తహశీల్దారుగా విధులు నిర్వహించిన మహమ్మద్ పఠాన్ అలీ ఖాన్ బదిలీపై కడప జిల్లాకు వెళ్లారు. తిరుపతి జిల్లా వడమాలపేట మండల తహశీల్దారు ఐ సుబ్రహ్మణ్యం ఎన్నికల బదిలీల నిమిత్తం కడపకు బదిలీపై వెళ్లారు. తిరిగి బదిలీపై బుచ్చినాయుడు కండ్రిగ మండల తహశీల్దారుగా బదిలీపై నియమితులయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దారు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరువ చేసి మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. మండలంలో రెవెన్యూ కార్యాలయంలో సకాలంలో పనులు చేయలేదని ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని అలా వస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరిం చారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రశంసలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా డిటి చంద్రబాబు నాయుడు, సీనియర్ అసిస్టెం ట్ నాగార్జున రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు కిరణ్ కుమార్, గురునాథం, వీఆర్వోలు, వీఆర్ఏ, రెవెన్యూ సిబ్బందితో సమావేశమై పలు సూచన లు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు తహశీల్దారును అభినందించారు.



బాధ్యతలు స్వీకరించిన తహశీల్దారు మహమ్మద్ పఠాన్ అలీఖాన్

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మండల తహశీల్దారుగా ముని లక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో గూడూరు డివిజన్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పని చేసిన ఆమె ప్రభుత్వం తహశీల్దార్ల బదిలీలలో భాగంగా వెంకటగిరి తహశీల్దారు గా బాధ్యతలు చేపట్టారు. ప్రజల సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి గ్రామ రెవెన్యూ అధికారులతో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండల నూతన తహశీల్దారుగా మధుసూదన్ రావు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ తహశీల్దారుగా పనిచేస్తున్న రామసుబ్బయ్య చంద్రగిరి కి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో బద్వేలు తహశీల్దారుగా పనిచేస్తున్న మధుసూదన్ రావు బాధ్యతలు చేపట్టారు. మధుసూదన్ రావు గతంలో తొట్టంబేడు మండల డీటీగా పనిచేశారు.

సత్యవేడు: సత్యవేడు తహశీల్దారుగా టీవీ సుబ్రహ్మణ్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తహశీల్దారుగా సుబ్రహ్మణ్యం ని కలిసి పలువురు అభినందనలు తెలిపారు.

పెండింగ్ జీతం చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలి


గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ డిమాండు



ప్రజాశక్తి - సత్యవేడు: తమ సమస్యలను పరిష్కరించాలని గ్రీన్ అంబాసిడర్ పారిశుద్ధ్య కార్మికులు సిఐటియు సత్యవేడు మండల కార్యదర్శి మెలుగు రమేష్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గ్రీవెన్ సెల్ కార్యక్రమంలో ఎంపీడీవోకి తమ బకాయి జీతాలను చెల్లించి ఉపాధి భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శేఖర్, కార్యదర్శి మునస్వామి మాట్లాడుతూ 2019 నుంచి ఇంత వరకు సుమారు 42 నెలలుగా తమ పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు అందక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గ్రీన్ అంబాసిడరుకు వర్కర్సు జీతాలు ఇవ్వకపోయినా విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంబంధిత పంచాయతీ సెక్రటరీలు, సర్పంచుల నిర్లక్ష్య వైఖరి బాధాకరమని వాపోయారు. కొన్ని పంచాయతీల్లో సెక్రెటరీలు, సర్పంచులు పారిశుద్ధ్య పనులను వేరే కార్మికులతో చేపట్టడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. స్థానిక ఎంపీడీవో, పంచాయతీ రాజ్ ఇవోఆర్‌డి అధికారిని అనేకమార్లు సందర్శించి తమ సమస్యను పరిష్కరించాలని వేడుకున్నా నిధులు కేటాయించలేదనో, తమకు సంబంధం లేదనో, మరొక అధికారిని కలవాలనో మాటలు చెబుతూ దాటవేస్తూ కాలయాపన చేస్తున్నారే తప్ప తమ సమస్యను పరిష్కరించే నాథుడు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్‌లకు జీతం చెల్లించి ఉపాధి భద్రత కల్పించాలని కోరారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఎంపిడిఓ సానుకూలంగా స్పందించారని తెలిపారు. సత్యవేడు మండల సిఐటియు కార్యదర్శి మెలుగు రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే గ్రీన్ అంబాసిడర్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓపెన్‌స్కూలు అడ్మిషన్లు ప్రారంభం

- పదవ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి ఆహ్వానం
- ప్రధానోపాధ్యాయులు రమణయ్య



ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూలు 10వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభ మయ్యాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె రమణయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్ అడ్మిషన్లు ఈ నెల ఒకటవ తేదీ నుండి ప్రారంభమ య్యాయని, ఏ విద్యార్హత లేకుండా 14 సంవత్సరాలు పూర్తయిన వారు మాత్రమే 10వ తరగతి చదివేందుకు అర్హులని తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన వారు, ఇంటరు ఫెయిల్ అయిన వారు ఓపెనింగ్ ఇంటర్‌లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. ఈ పదవ తరగతి పాసైన విద్యార్థులు ఒక సంవత్సరం ఇంటర్‌మీడియేట్ కోర్సు పూర్తి చేయవచ్చు నని తెలిపారు. పూర్తి వివరాలు ప్రధానోపాధ్యాయులు 9502527708 ఫోన్ నెంబరు ద్వారా తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యత

- మినీ గోకులాలు పథకంతో పశువులకు రక్షణ
- ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్



ప్రదర్శనలో దూడలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పాడి పరిశ్రమ అభివృద్ధికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగానే మినీ గురుకులాల ఏర్పాటు పథకం పశువులకు రక్షణ కల్పిస్తుందని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వడమాలపేట మండలం టిసి అగ్రహారంలో గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం, లేగ దూడల ప్రదర్శన సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ లేగ దూడల పెంపకం పట్ల పాడి రైతులకు అవగాహన కలిగించేందుకు ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో మరెన్నో నిర్వహించాలని పాడి పరిశ్రమ అభివృద్ధికి తాను కృషి చేస్తానని, పాడి రైతులు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ క్యాంపులో 50 పేయదూడలు వివిధ పాడి రైతులు తీసుకొచ్చి పాల్గొన్నారు. బలిష్టంగా ఉన్న మూడు దూడలను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు గుర్తించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈ ఉచిత పశు వైద్య శిబిరంలో 62 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. రైతులు మేలు జాతి దూడలను పొంది, దూడల పెంపకంలో అనుసరించాల్సిన మెలకువలను పశు వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాఖ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతి ప్రదానం



ప్రోత్సాహక నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్ 2024 వ సంవత్సరం పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు ఇదే పాఠశాలలో (1995–96 బ్యాచ్) చదివిన పూర్వ విద్యార్థి జాకీర్ హుస్సేన్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. 1995–96 విద్యా సంవత్సరంలో పిచ్చాటూరు జెడ్పీ హైస్కూలులో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం గత ఏడాది నిర్వహించారు. ఈ సమ్మేళనంలో తాము చదువుకున్న పాఠశాలకు ఏదైనా మంచి చేయాలనుకున్నారు. 10వ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించి మొదటి, ద్వితీయ స్థానంలో నిలిచే విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున ఇద్దరికీ కలిపి మొత్తం రూ.10 వేలు అందించాలని జాకీర్ హుస్సేన్ నిర్ణయించారు. ఈ మేరకు 2024 పదవ తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన ఈ పాఠశాల విద్యార్థి సోమశేఖర్ (579 మార్కులు) 560 మార్కులతో ద్వితీయ స్థానం పొందిన మదన్‌కు ప్రోత్సా హక నగదును పూర్వ విద్యార్థి జాకీర్ హుస్సేన్ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల 1995–96 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థులు రియాజ్, కిరుబకరణ్, హెచ్.ఎమ్ గిరి ప్రకాష్ పాల్గొన్నారు.

'నిషేధిత జాబితా నుండి ఆ సర్వే నెంబరును తొలగించాలి'



మాట్లాడుతున్న ఎస్‌వి ఆటోనగర్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి ఆటోనగర్‌లో కార్మికుల కోసం ఏపీఐఐసి కేటాయించిన సర్వే నెంబర్లు గతంలో రిజిస్ట్రేషన్ అయ్యేవని, 2017లో ఈ సర్వే నెంబర్లు 74/7, 95/2ను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నిషేధిత జాబితా నుండి ఈ సర్వే నెంబర్లను తొలగించాలని ఎస్వీ ఆటోనగర్ అసోసియేషన్ నాయకులు హరిబాబు, ప్రసాద్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2000లో ఏపీఐఐసి ద్వారా తిరుపతి రేణిగుంట మార్గంలో అక్కారంపల్లి సర్వే నెంబర్ 74/7, మంగళం సర్వే నెంబర్ 95/2లోని 32 ఎకరాల 7 సెంట్ల భూమిలో 350 ప్లాట్లు వేసి ఇక్కడి కార్మికులకు రిజిస్ట్రేషన్ చేసి జీవనోపాధి కల్పించారన్నారు. వయస్సు మీదపడి వ్యక్తిగత అవసరాలకు ఈ స్థలాన్ని బ్యాంకులలో తనఖా పెట్టడానికి గాని, విక్రయాలు చేసుకోవడానికి వీలు లేకుండా చేశారన్నారు. నిషేధిత జాబితా నుండి ఈ సర్వే నెంబర్లను తొలగించాలని కోరుతూ మంత్రి లోకేష్‌కు, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శికి లేఖలు రాశామని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు వెంకటేశ్వరరావు, పురుషోత్తం, రామలింగం పాల్గొన్నారు.

'విద్యుత్ షాక్‌కు కారకులపై చర్యలు తీసుకోవాలి'



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అడవి పందులను వేటాడటం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు తగిలి షాక్‌కు గురై తన రెండు కాళ్లు దెబ్బతిన్నాయని, తనకు జరిగిన అన్యాయంపై గత నెల 27వ తేదీ ఫిర్యాదు చేసినా బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని చంద్రగిరి నియోజక వర్గం, చిన్నగొట్టిగల్లు మండలం, దిగవూరు గ్రామం పాలమాకుల పల్లికి చెందిన శారద వాపోయింది. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ గత నెల 6వ తేదీ తాను కౌలు చేసుకుంటున్న పొలం వద్ద గొర్రెపిల్ల కలబడక పోవడంతో వెతుక్కుంటూ వెళుతూ సమీపంలోని ఉమాశేఖర్ అనే వ్యక్తి ఇం మరి కొందరు అడవి పందుల వేట కోసం విద్యుత్ లైన్లను మామిడి తోటలో ఏర్పాటు చేశారని, అది గమనించక వెళుతున్న సమయంలో కాలికి విద్యుత్ తీగ తగిలి పడిపోయానని తెలిపారు. తన కుమార్తె లక్ష్మీ భవాని గమనించి కాపాడిందన్నారు. ఈ విషయం గ్రామ పెద్దలకు తెలిసి న్యాయం కోసం పోరాడు తామని స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న తనకు హామీ ఇచ్చారని ఇప్పుడు ఎలాంటి న్యాయం చేయలేదని, బెదిరిస్తున్నారని తెలిపారు. తన కాళ్లు బాగు పడడానికి సుమారు 3 సంవత్సరాలు అవుతుందని వైద్యులు చెప్పారన్నారు. తన వైద్యానికి అయ్యే ఖర్చును ఇప్పించాలని, కలెక్టర్ అయినా తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో శారద సోదరి ధనలక్ష్మి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

తమిళనాడు వాసి ఆత్మహత్య

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి తిరుపతిలో ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేటు హోటల్లో తమిళనాడు, కాంచీపురం మండలం కలియం పూడికి చెందిన సంపత్ కుమార్ (52) తిరుపతిలోని ఓ హోటల్లో విషం సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. తమిళనాడులో ఐదు కోట్ల మేరకు అప్పు చేసి, అక్కడ నుంచి తిరుపతికి చేరుకొని 20 రోజులుగా జిల్లాలోని పలుచోట్ల సేద తీరాడు. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేటు స్థలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్జీవంగా పడి ఉన్న అతనిని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి అతని వద్ద ఉన్న సమాచారం మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

7న విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి -తిరుపతి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7వ తేదీన నగరిలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తామని నాగలాపురం విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రనాయక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పుత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధికి సంబంధించి నగరి పీవీకే ఫంక్షన్ హాల్లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఈ నెల ఏడో తేదీ బుధవారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. ఈ నేపథ్యంలో చైర్ పర్సన్, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు కె రామమోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు ఈశ్వరమ్మ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. ప్రధానంగా పుత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని పుత్తూరు, వడమాల పేట, రామచంద్రాపురం, నారాయణవనం, నగరి, విజయపురం, నింద్ర, కార్వేటి నగరం, వెదురుకుప్పం, శ్రీరంగరాజాపురం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాలెం మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలను రాత పూర్వకంగా సమర్పించి ప్రత్యేక విద్యుత్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చుని తెలిపారు. ఈ విద్యుత్ అదాలత్ కార్యక్రమానికి దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థకు చెందిన అధికారులు, సిబ్బంది హాజరవుతారని ఆయన వివరించారు. ఈ ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకొని వారి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

మరమ్మతుకు నోచుకోని పైపులైను

నెల రోజులుగా విద్యార్థులకు తాగునీటి ఇక్కట్లు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని పిల్లారిపట్టు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత నెల రోజులుగా తాగు నీరు లేక విద్యార్థినివిద్యార్థులకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ పాఠశాలలో 3వ తరగతి నుండి 10 వ తరగతి వరకు సుమారు 150 మంది విద్యార్థినివిద్యార్థులు వున్నారు. తాగునీటి పైపు మరమ్మతులకు గురై దాదాపు ఒక నెలరోజులు అవుతున్నా ఇటు పాలకులు, అటు ప్రభుత్వ అధికారులు పట్టించుకోలేదు. విద్యార్థులకు కాల కృత్యాలు తీర్చుకోవడానికి సైతం నీరు లేక నానా అవస్థలు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు మరమ్మతులకు గురైన పైపులైన్‌న వెంటనే బాగుచేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని విద్యార్థినివిద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆర్ట్స్ బ్లాక్ తరగతులను పరిశీలించిన విసి



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య అప్పారావు సోమవారం మధ్యాహ్నం ఆర్ట్స్ బ్లాక్ లోని తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు తదితర శాఖల తరగతులను తనిఖీ చేశారు. విద్యార్థుల గైర్హాజరుపై ఆచార్యులను వివరణ కోరారు. క్లాసులు, విద్యార్థుల హాజరుపై విసి ఉదాసీనత వహించబోనని , విద్యార్థులను సంబంధిత సబ్జెక్టులో లోతైన అధ్యయనం చేయించి జ్ఞానం పెంపొందించే బాధ్యత అధ్యాపకులపై వుందని వారు శాఖాధ్యక్షులకు తెలిపారు.

హేతుబద్ధీకరణ జరపాలి

ఉపాధ్యాయ సంఘం డిమాండ్

ప్రజాశక్తి -రామచంద్రపురం : ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ టిఐఎస్ ఆధారంగా ఆన్లైన్ లో రాష్ట్ర స్థాయిలో కాకుండా క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలులో జరిగే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జిల్లా స్థాయిలో జిల్లా విద్యా శాఖాధికారులు సమక్షం లో జరిపేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌టియు రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్‌టియు ఆధ్వర్యంలో రామచంద్రాపురం మండలంలో సమస్యల సేకరణ నిర్వహించారు. ఎస్టీయూ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం మాట్లాడుతూ ఏ పీ జీ ఎల్ ఐ మెచ్యూరిటీ క్లెయిమ్‌లు, లోన్ లు నగదు, జెడ్ పీపిఎఫ్ నాన్ రిఫుండబుల్, ,రీఫండబుల్ లోన్‌లు నగదు, ఎర్నెడ్ లీవు నగదు లను వెంటనే అయా ఉపాధ్యాయుల ఖాతాలలో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డివిజన్ కన్వీనర్ సి.వాసు, ఎస్‌టియు రామచంద్రాపురం ప్రధాన కార్యదర్శి వర ప్రసాద్ పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మనోహర్ తెలిపారు. ఎస్ వి వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి చిన్న పిల్లల విభాగం , రుయా ఆసుపత్రి అదనపు వైద్య విద్యా సంచాలకులు, సూపరిటెండెంట్ డాక్టర్ జి.రవి ప్రభు ఆదేశాల మేరకు, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి ప్రభు మాట్లాడుతూ పుట్టిన వెంటనే ఇచ్చే పసుపు రంగు పాలలో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచడమే కాకుండా, వారి మెదడు వికాసానికి తోడ్పడుతుందన్నారు. చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్యానికి తల్లి పాలు ఎంతో శ్రేష్ఠ మని, పుట్టిన గంట లోపు తల్లి మురిపాలు పట్టిస్తే వ్యాధి నిరోధక శక్తి పెంపొందించడంతో పాటు అమృతంలా పని పనిచేస్తుందని, బాలింతలు తమ బిడ్డకు ఆరు నెలలు వరకు తల్లిపాలును కొనసాగించాలని తెలిపారు. చిన్నపిల్లల విభాగ ప్రొఫెసర్ డాక్టర్ అంజన్ కుమార్ మాట్లాడుతూ ఈ తల్లిపాలు వారోత్సవాల్లో ప్రతి తల్లికి, ప్రజలకు అవగాహన ఎంతైనా అవసరమని ఈ ర్యాలీ వల్ల ప్రతి ఒక్కరికి ఈ సందేశం అంది తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం అందించవచ్చునని, తల్లి పాలు వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగ ప్రొఫెసర్ డాక్టర్ కిరీటి, వైద్యాధికారులు, వైద్యులు, నర్సింగ్ కళాశాల సిబ్బంది, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు

- కళాశాల ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎవరూ మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు బానిస కావదని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య పేర్కొన్నారు. సోమవారం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సమావేశం కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య ఎన్ఎస్ఎస్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పుత్తూరు న్యాయవాది మురుగేషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది 35 సంవత్సరాలు నిండిన వారు డ్రగ్స్‌కు బానిసలు అవుతున్నారన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎవరైనా డ్రగ్స్ కు బానిస అయిన వారు ఉంటే వాటిని దూరం చేసుకోవాలని విద్యార్థులు పట్ల పోటీ తత్వంతో చదువుకొని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వీరయ్య, జాతీయ సేవా పథకం సమన్వయకర్త రఘురాం, శ్రీనివాసులు, అధ్యాపకులు వెంకట కృష్ణయ్య, తిరుమలయ్య,, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి: ఎంఈవో

పజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): మండలంలో ఈ నెల 8వ తేదీ నిర్వహించనున్న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను పకడ్బందీగా స్థానిక ప్రజాప్రతినిధులకు తెలిపి నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారులు లలిత కుమారి, భాస్కర్ బాబులు కోరారు. మండలంలోని ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు , ఉపాధ్యాయులకు సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన చంద్రగిరి మండల విద్యాశాఖ అధికారులు ఎస్.లలిత కుమారి, కె.భాస్కర్ బాబులు ఎన్నికల నిర్వహణకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్ఎంటిలు పాల్గొన్నారు.

సమాజ హితం కోసం అహర్నిశలు శ్రమించేది జర్నలిస్టులే: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సమాజ హితం కోసం అహర్నిశలు శ్రమించేది జర్నలిస్టులే అని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో తిరుపతి వార్త పక్ష ప్రతిక 10వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యకమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తనకు జర్నలిస్టులంటే అభిమానమని, గతంలో చిత్తూరు ఎమ్మెల్యే ఉండే సమయంలో అక్కడి 170 మంది జర్నలిస్టులకు నగరం మధ్యలో జర్నలిస్టు కాలనీని ఏర్పాటు చేయించానన్నారు. ఇప్పుడు తిరుపతి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తాను అండగా నిలుస్తానన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్ సోంత భవనం నిర్మాణానికి స్థలం ఇస్తామని గతంలో చంద్రబాబు మాట ఇచ్చారని ఈ విషయంలో సహాయ సహాయ సహకారాలను అందివ్వాలని జర్నలిస్టులు కోరగా సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు నిరుపేద జర్నలిస్టులకు 10 బియ్యం బస్తాలను అందించారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత ఎన్‌వి ప్రసాద్, మాజీ టీటీడి డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, టిడిపి నేత పూకా విజయ్ కుమార్ పాల్గొన్నారు.